# ‘తల్లివూ అంది’

‘గుడీవినింగు’—సోల్జరుకుర్రాడు విష్ చేశాడు. అంబ పలుకలేదు. టకటకా జోళ్ళచప్పుడు చేసుకుంటూ ఆగని ట్రాంబండీలాగ వెళ్ళిపోయింది. సోల్జరు కుర్రాడు నిరాశ చెందలేదు. తనూ వెంటనడిచేడు. అమ్మాయి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ నడుస్తున్నాది. సోల్జరు పైకి కనబడనీయకుండా తనూ పెద్దఅడుగులు వేశాడు.

అమ్మాయిఇంట్లో ఒక అయస్కాంతం ఉంది. ఒక సాలెపట్టూ ఉంది. సోల్జరు ఒక ఇనుపరజంకానీ, ఈగ కానీ కావచ్చు. అమ్మాయి ఒక సినిమాథియేటరుముందు ఆగింది. బొమ్మలు చూస్తున్నాది. సోల్జరు ఆగేడు. కొంతదూరంలో నిలబడి, రోడ్డుమీద నిలబడి, రోడ్డుమీద రాకపోకలు చూస్తున్నాడు. అమ్మాయి బొమ్మలు అదే ధ్యాసతో చూస్తున్నది, బహుశా నడుస్తున్నది. సోల్జరూవచ్చి బొమ్మలు చూస్తున్నాడు, బహుశా నటిస్తున్నాడు. అమ్మాయి సోల్జరువేపు చూడనట్లు నటిస్తూ చూసింది. సోల్జరు చూసీ చూడనట్టుగా చూశాడు. అమ్మాయి అక్కణ్ణించి కదిలింది. నడిచింది. పెద్దఅడుగులతోనే నాల్గడుగులువేసి ఆగిపోయింది. ఎవరికో ఏమో నిరీక్షిస్తూన్నది. సోల్జరు బొమ్మలుచూడ్డం ఆపి దిక్కులు చూసి అమ్మాయివేపు నడిచాడు. దగ్గరకొచ్చాడు. ఒక పేపరు కుర్రాడు ఖర్మంచాలకో అదృష్టం బాగుండో అడ్డొచ్చి పేపరుకొంటారా అని ప్రశ్నిస్తున్నట్లు నించున్నాడు.

నించోడంతోనే ప్రశ్నించాను. సోల్జరు పేపరు కొన్నాడు. పావలాఇచ్చి చిల్లర పుచ్చుకోలేదు. అమ్మాయి ఇప్పుడు కూడా చూసీచూడనట్టు చూస్తూన్నది. ఇద్దరికీ ఎంతో దూరంలేదు.

పేపరు చంకలోపెట్టి 'గుడీవినింగు' అని విష్‌చేశాడు. అమ్మాయి నన్నా అన్నట్టుచూసి మరుక్షణంలో 'ఓ! గుడీవినింగు' అని ఎదురువిష్‌చేసింది. సోల్జరు ఇద్దరిమధ్యా ఉన్న దూరాన్ని తగ్గించి,దగ్గరకొచ్చి, నాతో ఏదేనా సినీమా కొచ్చేందుకి అభ్యంతరంవుందా అని అడిగేడు. అమ్మాయి ఆమాటకోసమే ఎదురుచూస్తున్నది కాబట్టి ఏవిధమైన అభ్యంతరం లేదంది.

సోల్జరు మోచెయ్యి కొక్కెంలో అమ్మాయి తన చెయ్యిపెట్టింది. యిద్దరూ బజారులోపడ్డారు. అమ్మాయిపేరు ఎడ్వినా. సోల్జరుపేరు అనవసరం ఎడ్వినా పధ్దెనిమిదేండ్ల ఆంగ్లోయిండియన్ అమ్మాయి. జననమరణాల రిజిష్ట్రారు ఆఫీసుల్లోకి తరవాత సావకాశంగావెళ్ళి ఈ అమ్మాయి ఎవ రెవరికి ఎప్పుడు ఎక్కడ పుట్టిందీ చిత్రాలు వెదికి తీద్దాం. అంతదాకా ఈపిల్ల గాలికిపుట్టి ధూళికి పెరిగిందని మనం అను కొంటే ఆపిల్ల ఏవిధమైన అభ్యంతరం చెప్పదు.

ఎడ్వినా ఎక్కడ కాపురం ఉంటున్నదీ కావలిస్తే చెప్ప గలున్నగానీ, ఎల్లాగ్ వినా ప్రస్తుతం ఒకవిధమైన ఆర్జనపరురాలు. యుద్ధమున్నంతకాలం ఒకవిధమైన దీక్షాపరురాలు! మీరు ఆపిల్ల గురించి, ఇంకా భోగట్టాలు అడగొద్దు. కావలిస్తే

మనం వాటివెనకే పోదాం. పాఠక మహాశయా! మనం పత్తే దారుని అనుసరించెదముగాక!

వినాని సోల్జరు అడిగేడు. షాపింగ్‌కి వెళదామాఅని! వినా అతణ్ణి ఎల్లాగా అందుకు లాక్కెళ్ళే మనిషే. వెళ్ళేరు. టాయిలెట్‌సామాన్లు చాలాకొన్నారు. ఒకషాపులో మా మంచిగౌను ఉంది, కొంటావాఅంది. కొన్నా? అని అడిగేడు. కొనలేదు.

ఒకసోఫాలో కూర్చున్నారు. ఎక్కడ ఎందుకు అనే ప్రశ్నలను రానివ్వవద్దు. సోల్జరు జేబులోని ఫొటోతీసి వినాకి చూపించాడు. ఈమె నాపెళ్ళాం అన్నాడు. వినా ఊఁ బావుంది అంది. ఈ అబ్బాయి నాకొడుకన్నాడు. ఇలాంటి వాడు నాకు పుడితే బావుణ్ణు అంది. ఇది బొంబాయిలో ఓ పిల్లది అన్నాడు. వినామాట్లాడలేదు.

సోల్జరు నిన్న తనపుట్టినరోజన్నాడు. వినా వారంరోజులతరువాత తన పుట్టినరోజని చెప్పి అతణ్ణి ఆనాడు విందుకు పిలిచింది. ఎడ్రసు ఇచ్చింది. సిగరెట్టుతీసి వినా కొకటి ఇచ్చేడు. కాల్చింది.

ఇంగ్లండునుంచి నిన్న దిగిన సిగరెట్లు. విందునాటికి ఆగౌను కొంటానని సోల్జరు మాటయిచ్చేడు.

సోల్జరుకి కొన్ని హిందీముక్కలువచ్చు. వినానిచూసి యూ పక్కా రాజా అన్నాడు. పికారీవాలా అన్నాడు. తనికిదో అనిందో పైసాదేఖో యిష్టంలేదన్నాడు. అది ఖరాబు అని వెలిబుచ్చేడు.

కొంతరాత్రి తరవాత.

* * * *

వినా యింటికిచేరుకుంది. యిల్లు చాలాపెద్దది. అందమైనది. ఫర్నిచరు బోల్డంతఉంది. వినాతల్లి చిరుగుల పాత గౌను తొడుక్కొనిఉంది. తల్లి ఏమిటో అడిగింది. పిల్ల ఏమిటో చెప్పింది. తల్లికి పిల్ల తను కొన్న (బహుశా- కొనిపించిన అనేది సరియైనమాట) సామానులు చూపించింది. గౌనులు లాండ్రీవాడు తెచ్చాడా అని అడిగింది. తల్లి ఊఁఅంది. ఎవరోవచ్చారా అని అడిగింది. తల్లి లేదంది. తల్లి పడుక్కుంది. పిల్ల పడుక్కోలేదు.

తలుపెవరో తట్టేరు. వినా తీసింది. లోపలికి ఎవరో వచ్చేరు. (ఎవరూ కారు మీరూ నేనూ. పాఠకమహాశయా! మనం ఈమెని అనుసరిస్తున్నాము). జార్జి వచ్చేడు. జార్జి వినాకి ప్రియుడు. పెళ్ళిచేసుకోవచ్చు.

వినా జీవితం చాలా బాగా సాఫీగా నడుస్తూన్నది. రోజుకో గౌను మారుస్తుంది. నాల్గుజతలజోళ్ళున్నాయి. నాల్గు రకాల హేటులున్నాయి, టాయిలెట్ సామానులు రెండు నెలలకి సరిపోతాయి. విల్సు సిగరెట్లు కాలుస్తుంది. యింతటికీ పిల్లకి పళ్ళున్నాది. వంటికి అందంఉంది.

వినాకి చదువు తక్కువకాదు. కాని దీక్షమానదు. ఉద్యోగం చూచుకోగలదు గానీ చెయ్యదు. షార్టుహేండు. టైపురైటింగువచ్చు గానీ మర్చిపోయింది. తను చేస్తున్నపని హేయమైనది అని అంతా అంటారు. గానీ తను అనుకోదు. వినా బ్యాంకులో మూడువందల రూపాయిలు నిలవజేసింది.

వారానికోసారి వినాకి పుట్టినరోజు. ఈ ఏడాదిలో వినా యిరవైయెదు పుట్టినరోజు పండుగలు చేసుకొంది. రేపు ఓ సోల్జరుని పండక్కి పిల్చింది. వారంరోజుల తరవాత మరొకడొస్తాడు. విందుకు వచ్చేవాడు పుట్టినరోజని బహుమానాలు తెస్తాడు. ఇల్లు నిండుతుంది, కడుపునిండుతుంది.

జార్జితో వినా 'నేను అలిసిపోయాను' అని చెప్పింది. జార్జి ఏరోజయినా ఇంతేగా అన్నాడు. జార్జి వినాని ఏమీ కోపపడడు. యిద్దరికీ ఒకరిసంగతి ఒకరికి తెలుసు.

వినా పాటపాడుతాను అంది. జార్జి పియానో వాయిస్తున్నాడు. వినా అది అద్దెకితెచ్చి ఇంట్లో పెట్టుకుంది. వినా పాడుతున్నది (పాటకమహాశయా మనం ఆపాల విందుము గాక)

[నాకు ఈకథ చెప్పిందికి చాలావిచారం వేస్తున్నది. గానీ చెప్పకతప్పదు. వినా పవిత్రమైన జీవితం గడపడం నాకూయిష్టమే. కాని గడపనంతకాలం గడుపుతున్నది ఎలా రాయను. వినా రోజూ దేముణ్ణి 'ఓ నన్ను కన్నతండ్రీ నాకూ రోజూ ఓరొట్టిముక్క యియ్యవోయ్!' అని ప్రార్థిస్తుంది దేవుడు ఇస్తున్నాడు. ఇచ్చేమార్గం మీకు నచ్చకపోవచ్చు. గాని మన మేంచెయ్యగలం? వినా బతుకుతున్నది. అందుకు తల్లి ఊఅంది.]